క్లుప్తంగా

కొండప్ప స్వామి ఆరాధన


పూజలందుకుంటున్న కొండప్ప స్వామి

మద్దికెర: మద్దికెర– ఎం.అగ్రహారం రహదారిలో ఉన్న కొండప్ప స్వామి దేవాలయంలో అవధూత కొండప్ప స్వామి 45వ ఆరాధనోత్సవాలు గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారి మూలవిరాట్‌ను ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం అభిషేకం, మహా మంగళహారతి ఇచ్చారు. భక్తులు ఆకుపూజలు నిర్వహించారు. పూజలకు విచ్చేసిన భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం స్వామివారి ఉత్సవమూర్తిని గ్రామంలో ఊరేగింపు నిర్వహించి రాత్రి భజన కార్యక్రమాలు చేపట్టారు. నేడు ప్రత్యేక పూజలతోపాటు అన్నదాన కార్యక్రమాలు ఉంటాయని ఆలయ నిర్వాహకులు పక్కీరప్ప, పక్కీరమ్మ తెలిపారు.

కాశిరెడ్డినాయన ఆలయ వార్షికోత్సవం

తుగ్గలి: భక్తుల ఆరాధ్య దైవం సద్గురు కాశిరెడ్డినాయన ఆలయ 18వ వార్షికోత్సవం గురువారం రాంపల్లిలో వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచి రాత్రి వరకు స్వామికి ప్రత్యేక పూజలు, లక్ష్మీనరసింహస్వామి కల్యాణం నిర్వహించారు. భక్తులు స్వామి వారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. నిర్వాహకులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. స్థానికులతో పాటు చుట్టుపక్కల గ్రామల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు.

నర్సరీలో మళ్లీ మొక్కల అపహరణ

మద్దికెర: నర్సరీల్లో వరుస దొంగతనాలు జరుగుతుండడంతో యజమానులు ఆందోళన చెందుతున్నారు. మద్దికెరలోని గుంతకల్లు రహదారిలో గల పెట్రోల్ బంకు దగ్గర ఉన్న రాజేష్ నర్సరీలో గురువారం తెల్లవారుజామున గుర్తు తెలియని వ్యక్తులు దాదాపు 25 వేల మిరప మొక్కలు ఎత్తుకెళ్లినట్లు యజమాని రాజేష్ వాపోయారు. మిరప మొక్కలకు అధికంగా డిమాండు ఉండడంతో రైతులకు విక్రయించేందుకు నర్సరీలో అందుబాటులో ఉంచామన్నారు. గుర్తు తెలియని వ్యక్తులు మొక్కలు ఎత్తుకెళ్లారని ఆవేదన వ్యక్తం చేశారు.

నేడు నగరూరులో 'గడప గడపకు మన ప్రభుత్వం'

ఆస్పరి: మండలంలోని నగరూరు గ్రామంలో శుక్రవారం నిర్వహించే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం హాజరు కానున్నట్లు జెడ్పీటీసీ సభ్యుడు దొరబాబు, సర్పంచ్ సావిత్రమ్మ గురువారం తెలిపారు. నగరూరు బీటీ రోడ్డు మరమ్మతులకు రూ.30 లక్షలు మంజూరుకాగా మంత్రి భూమి పూజ చేసి పనులు ప్రారంభిస్తారన్నారు. అలాగే మంత్రి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరిస్తారన్నారన్నారు. అదేవిధంగా ప్రజల సమస్యలు తెలుసుకుని పరిష్కార చర్యలు చేపడుతారన్నారు. అధికారులు, వలంటీర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొనాలని కోరారు.

ఎల్లార్తి దర్గాల్లో భక్తిశ్రద్ధలతో ఫాతెహాలు

హొళగుంద: మండల పరిధిలోని ఎల్లార్తి శేక్షావలి, షాషావలి దర్గాలను గురువారం భక్తులు దర్శించుకుని భక్తిశ్రద్ధలతో ప్రత్యేక ఫాతెహాలు నిర్వహించారు. దర్గాలో మొక్కులు చెల్లించుకోవడానికి జిల్లా నుంచే కాకుండా కర్ణాటక, తెలంగాణ తదితర దూర ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. ప్రత్యేక ఫాతెహాల్లో పాల్గొని దేవుళ్లకు నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అలాగే హొళగుంద సాయిబన్న, చిణిగితాతా దర్గాలు, షిర్డిసాయిబాబా ఆలయాలను భక్తులు దర్శనం చేసుకున్నారు. తీర్థ ప్రసాద పంపిణీ, అన్నదాన కార్యక్రమాలు జరిగాయి.

బాబాస్వామి సమాధికి జలాభిషేకం

పత్తికొండ రూరల్: వర్షం కోసం పందికోన గ్రామానికి చెందిన పెళ్లికాని ఐదుగురు యువకులు బాలు, శ్రీనివాసులు, సురేంద్ర, వినోద్, శ్రీను ఒక్కొక్కరు 101 బిందెలతో గ్రామంలోని పెనుబండ బాబా స్వామి సమాధికి గురువారం జలాభిషేకం చేశారు. ఇలా చేయడం వల్ల వర్షం కురుస్తుందని గ్రామస్తులు విశ్వాసం వ్యక్తం చేశారు. యువకులను అభినందించారు.

సీపీఐ పాదయాత్ర

ఆస్పరి: వేదావతి ప్రాజెక్టును 8 టీఎంసీల సామర్థ్యంతో నిర్మించి ఆస్పరి మండలానికి తాగు, సాగు నీరు అందించాలని డిమాండ్ చేస్తూ గురువారం మండలంలోని బిల్లేకల్లు నుంచి రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రయ్య, సీపీఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య ఆస్పరి వరకు పాదయాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆస్పరి మండలంలో రైతులు వర్షాధారంపైనే ఆధారపడి పంటలు సాగు చేస్తూ ఏటా నష్టాలు పాలవుతున్నారన్నారు. ఆస్పరి మండలానికి ప్రాజెక్టుల ద్వారా ఎలాంటి నీటి వసతి లేదన్నారు. దీంతో మండల ప్రజలు తాగు, సాగు నీరు లేక ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. ప్రభుత్వం వేదావతి ప్రాజెక్టు నీటిని ఆస్పరి మండలానికి సరఫరా చేసి సాగు, తాగు నీటిని అందించాలని కోరారు. రైతు సంఘం, సీపీఐ నాయకులు నాగేంద్రయ్య, విరుపాక్షి తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మిగనూరు ఈద్గాలో ఖురాన్ సందేశం వివరిస్తున్న మతగురువు మహమ్మద్‌బాషా సాహెబ్
ఈద్గాలో ప్రత్యేక నమాజులో పాల్గొన్న ముస్లింలు

త్యాగనిరతి చాటిన బక్రీద్


వెల్దుర్తి ఈద్గాలో నమాజు చేస్తున్న ముస్లింలు

సాక్షి నెట్‌వర్క్: త్యాగనిరతికి ప్రతీక బక్రీద్ పర్వదినాన్ని గురువారం డివిజన్‌వ్యాప్తంగా ముస్లింలు అత్యంత భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. ఉదయాన్నే స్నానాలు చేసి ప్రాత:కాల నమాజులు చేశారు. నూతన వస్త్రాలు ధరించి, అత్తరు, పన్నీరు పరిమళాలు జల్లుకుని ఇరుగు, పొరుగు, బంధుమిత్రులతో కలసి మతగురువుల వెంట ఈద్గాలకు ర్యాలీగా వెళ్లారు. మానవుల మార్గదర్శకం కోసం, జీవిత సాఫల్యం కోసం పవిత్ర ఖురాన్ గ్రంథాన్ని అందించినందుకు దైవానికి కృతజ్ఞతలు చెప్పుకుంటూ ఈద్గాల వద్ద ముస్లింలు నమాజులు చేశారు. మతగురువులు ఖురాన్‌లోని నైతిక, ఆధ్యాత్మిక మార్గదర్శకాలను వివరించారు. అనవసర కార్యక్రమాలు, విందులు, వినోదాలకు, భోగవిలాసాలకు డబ్బు వృథా చేయకుండా నలుగురికి మేలు జరిగే మంచి పనులకు, సమాజ సంక్షేమ కార్యక్రమాలకు వినియోగిస్తే అల్లాహ్ కృపకు పాత్రులవుతారన్నారు. నమాజులు, ప్రార్థనల అనంతరం ముస్లింలు పరస్పరం ఈద్ ముబారక్ తెలుపుకున్నారు. అల్లాహ్‌కు ఖుర్బానీ సమర్పించారు. ఉదయాన్నే సేమియా పాయసం చేసి ఇరుగు, పొరుగు, బంధుమిత్రులకు వడ్డించారు. ఈద్గా నమాజు, ప్రార్థనల అనంతరం గుమగుమలాడే బిర్యానీ వంటకాలు చేసుకుని పండుగను ఘనంగా జరుపుకున్నారు. ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి ముస్లింలకు బక్రీద్ పర్వదిన శుభాకాంక్షలు తెలిపారు. వైఎస్సార్‌సీపీ ముస్లిం, మైనార్టీ నాయకులు ఎమ్మెల్యేను కలసి శుభాకాంక్షలు తెలిపారు.

ఆలూరు: సంపాదనలో కొంత మొత్తాన్ని దానం చేసే గుణాన్ని అలవర్చడం, త్యాగానికి ప్రతీకగా బక్రీద్ పండుగ నిలుస్తోందని కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం పేర్కొన్నారు. ఆయన గురువారం ముస్లింలకు పండుగ శుభాకాంక్షలు తెలుపుతూ ఓ ప్రకటన విడుదల చేశారు. ప్రతిఒక్కరికీ అల్లా కృప ఉండాలని ఆకాంక్షించారు.


టి.గోకులపాడులో నమాజులో పాల్గొన్న ముస్లింలు


పత్తికొండలో ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవికి పండుగ శుభాకాంక్షలు తెలుపుతున్న ముస్లింలు


మద్దికెరలో నమాజు చేస్తున్న ముస్లింలు


హొళగుందలో ఈద్గాకు ఊరేగింపుగా వెళ్తున్న ముస్లింలు


బందోబస్తు నిర్వహిస్తున్న పత్తికొండ డీఎస్పీ శ్రీనివాసరెడ్డి సిబ్బంది


ఆస్పరిలో ప్రార్థనలు చేసేందుకు తరలివెళ్తున్న ముస్లింలు

భక్తిశ్రద్ధలతో తొలి ఏకాదశి


కర్లకుంటలో పూజలందుకుంటున్న శ్రీదేవి, భూదేవి సమేత తిరుమలరాయుడు


పెరవళి రంగనాథస్వామికి తిరుమంజోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు


హెబ్బటంలో పూజలందుకుటంన్న వేంకటేశ్వర స్వామి

పత్తికొండటౌన్: ఆషాఢ శుద్ధ ఏకాదశి (తొలి ఏకాదశి) పర్వదినాన్ని గురువారం పత్తికొండ పట్టణంతో పాటు, నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో ఘనంగా జరుపుకున్నారు. పత్తికొండ బ్రాహ్మణవీధిలోని శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో ఆలయ అర్చకులు స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి, ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి స్వామి వారిని దర్శించుకుని పూజల్లో పాల్గొన్నారు. పలువురు ఉపవాస దీక్ష పాటించి భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. స్వామివారి ఉత్సవమూర్తులను పల్లకీలో ఉంచి ప్రధాన వీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు.

మద్దికెర: మండల పరిధిలోని పెరవలి గ్రామంలో ప్రసిద్ధి చెందిన రంగనాథ స్వామి దేవాలయంలో గురువారం తొలి ఏకాదశి సందర్భంగా స్వామివారికి తిరుమంజనోత్సవం వైభవంగా నిర్వహించారు.ముందుగా ఆలయంలో ఉదయం బిందెసేవ, అష్టోత్తర నామార్చన, అభిషేక కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం మూలవిరాట్‌ను అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రత్యేక అలంకరణలో సతీసమేతంగా స్వామివారిని కల్యాణ మండపంలో కొలువుతీర్చారు. వేద పండితులు వేదమంత్రాలతో తిరుమంజోత్సవం కనుల పండువగా జరిపించారు. పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు. భక్తులకు ప్రసాదం వినిమయం చేశారు.

కృష్ణగిరి: ఆషాఢ మాస తొలి ఏకాదశిని పురస్కరించుకుని మండలవ్యాప్తంగా అన్ని దేవాలయాల్లో భక్తులు గురువారం ప్రత్యేక పూజలు చేశారు. శ్రీమహావిష్ణువు క్షీరాబ్ధి నందు శయనిస్తాడు గనుక దీన్ని శయన ఏకాదశి అని కూడా అంటారని పురోహితులు తెలిపారు. ఈ రోజు ఉపవాసం ఉండి, రాత్రికి జాగారం చేసి మర్నాడు ద్వాదశిన విష్ణుమూర్తిని పూజించి తీర్థ ప్రసాదాలను స్వీకరించిన పిదప భోజనం చేస్తే పాప ప్రక్షాళన అవుతాయని భక్తుల నమ్మకం. అలాగే మండల పరిధిలోని కర్లకుంట గ్రామంలోని తిరుమలరాయుడు దేవాలయంలో భక్తులు అధిక సంఖ్యలో స్వామి వారిని దర్శించుకుని పూజలు చేశారు.

ఘనంగా తొలి ఏకాదశి

హొళగుంద: మండలంలో గురువారం తొలి ఏకాదశిని ప్రజలు భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. ఆలయాల్లో, ఇళ్లల్లో స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. హెబ్బటం, హొళగుంద తదితర గ్రామాల్లో వేంకటేశ్వర స్వామి, ఆంజనేయ స్వామి ఆలయాల్లో భక్తులు జలాభిషేకలు, ఆకు పూజ, మహామంగళారతి తదితర పూజలు నిర్వహించారు. భక్తులు స్వామివారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయాలకు వచ్చిన భక్తులకు పూజారులు తీర్థ ప్రసాదాన్ని పంచి పెట్టారు.


పత్తికొండలో లక్ష్మీ వేంకటేశ్వర స్వామి గ్రామోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

పొలం విషయంలో ఇరువర్గాల ఘర్షణ

- 16 మందికి గాయాలు


గాయపడిన బోయ పెద్ద గుంటెప్ప వర్గీయులు


చాకలి పెద్ద నల్లన్న వర్గీయులు

ఎమ్మిగనూరురూరల్: పొలం విషయంలో గురువారం ఇరువర్గాల మధ్య ఘర్షణ జరిగి 16 మందికి గాయాలయ్యాయి. పోలీసులకు తెలిపిన వివరాల మేరకు.. గుడేకల్ గ్రామానికి చెందిన చాకలి పెద్ద నల్లన్న కొన్ని సంవత్సరాలుగా ఐదు ఎకరాల ప్రభుత్వ భూమిని సాగు చేసుకుంటూ పట్టాదారు పాస్ పుస్తకం పొందాడు. అయితే పొలం పక్కనే ఉన్న బోయ పెద్ద గుంటెప్ప తనకూ ఈ ఐదు ఎకరాలపై హక్కు ఉందని గొడవపడేవాడు. సమస్య పోలీసులు, రెవెన్యూ అధికారుల వద్దకు వెళ్లడంతో రెవెన్యూ రికార్డుల ప్రకారం ఐదు ఎకరాలపై హక్కు చాకలి పెద్ద నల్లన్నకే ఉందని తేల్చి చెప్పారు. అయితే గురువారం పొలం పనులకు వెళ్తున్న చాకలి పెద్ద నల్లన్న కుటుంబ సభ్యులతో బోయ పెద్ద గుంటెప్ప కుటుంబ సభ్యులు వాగ్వాదానికి దిగారు. ఇరు వర్గాల వారు రాళ్లు కర్రలు, కారంతో దాడులు చేసుకోవటంతో 16 మందికి గాయాలయ్యాయి. గాయపడిన చాకలి పెద్ద నల్లన్న, శ్రీనివాసులు, నడిపి నల్లన్న, తిమ్మప్ప, వెంకటేష్, తిప్పన్న, నడవలయ్య, రాజు, ఈరమ్మ, లక్ష్మి, మల్లమ్మ, బోయ పెద్ద గుంటెప్ప, నడవలయ్య, ఆంజనేయులు, నాగమ్మ, సునీతను చికిత్స నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఇరు వర్గాలపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎమ్మిగనూరు రూరల్ ఎస్ఐ పి.నిరంజన్‌రెడ్డి తెలిపారు.

ప్రజా సమస్యల పరిష్కారానికే 'జగనన్న సురక్ష'

- ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి
- జూలై 1 నుంచి కార్యక్రమం ప్రారంభం
- అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించడమే ధ్యేయం


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

పత్తికొండ టౌన్: అర్హత కలిగిన ఏ ఒక్కరూ సంక్షేమ పథకాలు అందకుండా మిగిలిపోకూడదు, ప్రజలందరికీ ప్రభుత్వ సేవలు సంతృప్తికర స్థాయిలో అందాలనే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయం మేరకు జూలై 1 నుంచి 'జగనన్న సురక్ష' కార్యక్రమానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి తెలిపారు. గురువారం పత్తికొండ వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ప్రజాప్రతినిధులు, పార్టీ ముఖ్యనాయకులతో ఎమ్మెల్యే సమావేశమై జగనన్న సురక్ష కార్యక్రమం గురించి వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి కొనసాగింపుగా, ప్రతి గడపకు వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకోవడంతో పాటు అర్హులై ఉండి పథకాలు అందని వారిని గుర్తించి, వారికి లబ్ధి చేకూర్చేలా చూడటమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం అని వివరించారు. జూలై 1 నుంచి ఈ కార్యక్రమాన్ని విస్తృతంగా చేపట్టాలన్నారు. ప్రజాప్రతినిధులు, వలంటీర్లు, సచివాలయ సిబ్బంది, సచివాలయ కన్వీనర్లు, బూత్‌కన్వీనర్లు తమ పరిధిలోని ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజలతో మాట్లాడి, వారి సమస్యల పరిష్కారానికి కృషిచేస్తారన్నారు. ప్రభుత్వ పథకాలు పొందేందుకు అవసరమయ్యే 11 రకాల ధ్రువపత్రాలు (కుల, ఆదాయ, జనన, మరణ, వివాహ సర్టిఫికెట్లు, సీసీఆర్‌సీ. కొత్త రేషన్‌కార్డు, డివిజన్, హౌస్‌హోల్డ్ డివిజన్, మ్యాపింగ్, పొలాల పట్టాదారు పాసుపుస్తకాలు, మ్యుటేషన్ తదితర సేవలు) ఉచితంగానే అందిస్తారన్నారు. పార్టీలు, రాజకీయాలు, కులాలు, మతాలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ పథకాలు అందాలనేది సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయం అని, అందుకు అనుగుణంగా అందరూ పనిచేయాలన్నారు. ఎంపీపీ ఎం.నారాయణదాసు,నాయకులు సోమశేఖర్, భాస్కర్‌నాయక్ శ్రీరంగడు, కారం నాగరాజు, మోహన్‌క్రిష్ణ, పల్లె ప్రతాప్‌రెడ్డి, సర్పంచులు పూరిశ్రీరాములు, పొట్లపాటి ప్రవీణ, రహిమాన్, కురువ అంజినయ్య, కేశవరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పేదల ఇంట సంక్షేమ వెలుగులు


అటికెలగుండు గ్రామంలో లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

పత్తికొండ రూరల్: సీఎం జగనన్న పాలనలో పేదల ఇంట సంక్షేమ వెలుగులు ప్రకాశిస్తున్నాయని, అర్హులైన ప్రతి ఇంటికీ సంక్షేమ ఫలాలు అందుతున్నాయని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి అన్నారు. గురువారం మండల పరిధిలోని అటికెలగుండు గ్రామంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే శ్రీదేవి పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి గత నాలుగేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనలో అందించిన పథకాలను లబ్ధిదారులకు వివరించారు. ఎమ్మెల్యేకు గ్రామస్తులు అపూర్వ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సచివాలయ వ్యవస్థతో గ్రామాభివృద్ధికి బాటలు వేశారన్నారు. ఎలాంటి పైరవీలు లేకుండా అర్హతే ప్రామాణికంగా నేరుగా లబ్ధిదారులకే పథకాలు అందజేయడం వల్ల ప్రజలు ప్రభుత్వానికి బ్రహ్మరథం పడుతున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో జగనన్నను మళ్లీ సీఎంగా గెలిపించుకుంటే గ్రామాలు మరింత అభివృద్ధి చెందుతాయని వివరించారు. ఎంపీపీ నారాయణదాస్, సింగిల్‌విండో అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, సర్పంచ్ లాల్‌బీ, జెడ్పీటీసీ ఉరుకుందమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు శ్రీరంగడు, బాబుల్‌రెడ్డి, నలకదొడ్డి కృష్ణ, ఎంపీటీసీ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

జేసీఎస్ మండల ఇన్‌చార్జ్‌ల నియామకం

ఎమ్మిగనూరుటౌన్: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఎమ్మిగనూరు నియోజకవర్గంలో జగనన్న సచివాలయ కన్వీనర్ల మండల ఇన్‌చార్జ్‌లను నియమించినట్లు పార్టీ కేంద్ర కార్యాలయం గురువారం ప్రకటన విడుదల చేసింది. ఎమ్మిగనూరు పట్టణానికి బంగిశ్రీరాం, ముల్లా షబ్బీర్‌అహమ్మద్, ఎమ్మిగనూరు మండలానికి బీఆర్ బసిరెడ్డి, గోనెగండ్ల మండలానికి పి.మనోహర్‌రెడ్డి, నందవరం మండలానికి ముల్లా చాంద్‌బాషాలను నియమించారు.

ఆలూరు: నియోజకవర్గంలో ఆలూరు జేసీఎస్ మండల ఇన్‌చార్జ్‌గా బొగ్గరు ఈరన్న, ఆస్పరి మండలానికి చిన్నహోతూరు బసవరాజ్, చిప్పగిరి మండలానికి డి.సతీష్, దేవనకొండ మండలానికి సిద్ధం రాజారెడ్డి, హాలహర్వి మండలానికి వెంకటేశ్వర్లు, హొళగుందకు బి.మల్లికార్జునను నియమిస్తూ వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది.

పత్తికొండ నియోజకవర్గంలో మండలాల వారీగా జేసీఎస్ ఇన్‌చార్జ్‌లు

పత్తికొండ	బళ్లారి మోహన్‌క్రిష్ణ
తుగ్గలి	రాచపాటి హనుమంతు
మద్దికెర	దాసరి కవిదాసు
కృష్ణగిరి	డాక్టర్ కంగాటి వెంకట్రామిరెడ్డి
వెల్దుర్తి	షమీర్ రెడ్డి

స్పీడ్ బ్రేకర్ల ఏర్పాటుకు చర్యలు


ఏర్పాటవుతున్న స్పీడ్ బ్రేకర్లు

వెల్దుర్తి: స్థానిక పోలీసుల ఆధ్వర్యంలో రామళ్లకోట రోడ్డులోని వెల్దుర్తి వంక బ్రిడ్జ్ 5 రోడ్ల కూడలిలో స్పీడ్ బ్రేకర్ల ఏర్పాటుకు చర్యలు ప్రారంభమయ్యాయి. ఈ కూడలిలో వెల్దుర్తి వైపు, బస్టాండు వైపు, రాణితోట వైపు, ఎల్లమ్మ గుడివైపు, రామళ్లకోట వైపు నుంచి ప్రజల రాకపోకలు అధికంగా ఉంటాయి. వెల్దుర్తి వంకపై ప్రభుత్వం నూతనంగా వెడల్పాటి బ్రిడ్జ్ నిర్మాణం చేపట్టడంతో రామళ్లకోట వైపు నుంచి, వెల్దుర్తి పాత బస్టాండు వైపు నుంచి ప్రతిరోజు వేలాది వాహనాలు అతివేగంగా ప్రయాణిస్తూ ప్రమాదాలకు కారణమవుతున్నాయి. ఇటీవలే పలువురు గాయాలపాలు కావడంతో స్థానికులు స్పీడ్‌బ్రేకర్లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. దీంతో సీఐ యుగంధర్ వాహనాల వేగాన్ని నియంత్రించే ప్రక్రియలో స్పీడ్ బ్రేకర్ల ఏర్పాటుకు పూనుకున్నారు. గురువారం పనులు ప్రారంభించారు. రెండు మూడు రోజుల్లో పనులు పూర్తి చేయనున్నట్లు సీఐ తెలిపారు. పోలీసుల చర్యల పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ధర్మ సందేశంపై ప్రచారం

ఆలూరు: ప్రతి ఒక్కరూ ధర్మం పాటిస్తే భవిష్యత్తు లో అదే రక్షిస్తుందని పంచాగ పఠనకర్త మాణిక్య ప్రభ భక్తులకు హితవు పలికారు. మండలంలోని మొలగవెల్లి గ్రామంలో గురువారం పాండురంగ స్వామి సంకీర్తనలతో ధర్మప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు, పంచాంగ పఠనకర్త మానిక్య ప్రభ మాట్లాడారు. అంతకుముందు ఆలయంలో ఏకాదశి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామంలో ధర్మ ప్రచారం నిర్వహించారు. అదేవిధంగా హత్తిబెళగల్ గ్రామంలో కొలువుదీరిన, మంత్రాలయం రాఘవేంద్రస్వామి అమృత హస్తాలచేత ప్రతిష్ఠించిన పంతవెంకన్న ఆంజనేయస్వామి ఆలయంలో అర్చకులు ప్రాణేచిఆచార్ ప్రత్యేక పూజలు చేశారు. ఆలూరులోని పాండురంగస్వామి, సుంకులాదేవి, చెన్నకేశవ స్వామి, సాయిబాబా, మంత్రితాత మఠం ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కుబడులు చెల్లించుకున్నారు.

సస్పెన్షన్ ఎత్తివేయాలి

వెల్దుర్తి: ఎన్ఆర్ఈజీఎస్ పనుల్లో నిర్లక్ష్యం అంటూ ఇటీవల సస్పెండ్ చేసిన టీఏ రాజశేఖర్‌పై సస్పెన్షన్ వెంటనే ఎత్తివేయాలని సీపీఐ మండల కార్యదర్శి టి.కృష్ణ డిమాండ్ చేశారు. గురువారం ఆయన మాట్లాడుతూ.. కూలీలు సరైన వేతనాలందుకునేలా అభివృద్ధి పనులు చేపట్టడంలో ముందుండే టీఏను గ్రామ నాయకులు కుటిల రాజకీయాలతో బలి చేయడం దారుణమన్నారు. ఉన్నతాధికారులు పూర్తిస్థాయి విచారణ చేపట్టి టీఏ సస్పెన్షన్ ఎత్తివేసి తిరిగి విధుల్లోకి తీసుకోవాలని కోరారు. సీపీఐ మండల ప్రతినిధులు మాధవకృష్ణ, బాలరాజు, ఎల్లశేఖర్, ఎల్లరాముడు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ మండల కమిటీ ఎన్నిక

వెల్దుర్తి: ఎమ్మార్పీఎస్ మండల నూతన కమిటీ ఎన్నిక గురువారం ఏకగ్రీవంగా జరిగినట్లు సమితి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దాదిపోగు నవీన్‌మాదిగ తెలిపారు. కర్నూలులో సమితి రాష్ట్ర అధ్యక్షుడు పేరుపోగు వెంకటేశ్వరరావు, జిల్లా అధ్యక్షుడు కిరణ్ ఆధ్వర్యంలో జరిగిన ఎన్నికలో వెల్దుర్తి మండల అధ్యక్షుడిగా ఎల్లకృష్ణ, ఉపాధ్యక్షుడిగా పెద్ద రంగడు, ప్రధాన కార్యదర్శిగా పుల్లయ్య, కార్యదర్శులుగా ఇజ్రాయేలు, తిరుపాలు, హనుమంతు, యువసేన మండల అధ్యక్షుడిగా మధును ఎన్నుకున్నట్లు వెల్లడించారు.

పత్తి రైతుకు పెద్ద కష్టం


జొహరాపురంలో ట్రాక్టర్‌తో పత్తి పైరును దున్నేస్తున్న రైతన్న

నందవరం: వరుణుడు ముఖం చాటేయడంతో మండలంలో పత్తి సాగుచేసిన రైతులు ఎదుగుదల లేని పైర్లను చూసి ఆవేదన చెందుతున్నారు. కొంత మంది రైతులు పత్తి పైర్లను తొలగిస్తున్నారు. కొన్ని పొలాల్లో విత్తనాలు వేసినా మొలకెత్త లేదు. మరి కొన్ని అరకొరగా మొలకెత్తాయి. ముందుస్తు వర్షాలకు వేసుకున్న పైర్లు ఎర్ర తెగులు బారిన పడ్డాయి. ఈ నేపథ్యంలో రైతులు తమ పొలల్లో వేసుకున్న పత్తి పైరును తొలగించేందుకు పూనుకుంటున్నారు. దాదాపు ఖరీఫ్ ఆరంభం నుంచి వాన చినుకు లేక పోయింది. నైరుతి పవనాలు సైతం అంతగా ప్రభావం చూపకపోవడంతో రైతులు కలత చెందుతున్నారు. పంటలను అర్థాంతరంగా తొలగించి నష్టాలను ముట్టకట్టుకుంటున్నారు. వానదేవుడి రాకకోసమై ఎదురు చూపులు చూస్తున్నారు. మండలంలోని పెద్దకొత్తిలి, గంగవరం, జొహరాపురం, నాగలదిన్నె, చిన్నకొత్తిలి, నందవరం తదితర గ్రామాల్లో దాదాపు 100 ఎకరాల్లో రైతులు పత్తి పైరును తొలగించినట్లు అంచనా.

డాక్టర్ టామ్ ఫ్రయర్స్‌కు నివాళి


ఆస్పరిలో నివాళులర్పిస్తున్న సెక్రెడ్ సంస్థ సభ్యులు, దివ్యాంగులు

ఆస్పరి: దివ్యాంగుల కోసం సహాయ సహకారాలు అందించిన ఇంగ్లండ్‌కు చెందిన టామ్ ఫ్రయర్స్ మృతి పట్ల గురువారం ఆస్పరిలో సెక్రెడ్ సంస్థ ఆధ్వర్యంలో దివ్యాంగులు సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సెక్రెడ్ సంస్థ డైరెక్టర్ తిప్పన్న మాట్లాడుతూ.. డాక్టర్ టామ్ ఫ్రయర్స్ ఇంగ్లాండ్‌లో యాక్షన్ ఫర్ డిస్‌ఎబిలిటీ స్వచ్ఛంద సంస్థ స్థాపించి దివ్యాంగుల కోసం కర్నూలు జిల్లాలో పునరావాస భవనాలు, దివ్యాంగులకు ఆర్థిక సహాయం చేశాడన్నారు. ఆయన సేవలు మరువరానివన్నారు. ఈయన ఈనెల 8వ తేదీన ఇంగ్లాండ్‌లో హఠాన్మరణం చెందడం బాధకరమన్నారు. కార్యక్రమంలో సెక్రెడ్ సంస్థ సభ్యులు లక్ష్మి ప్రసన్న, చంద్రశేఖర్, ఉమాదేవి, రామాంజినేయులు తదితరులు పాల్గొన్నారు.

జోరుగా ఉపాధి పనులు


గంగవరం వద్ద వంకలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

నందవరం: మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులు జోరుగా సాగుతున్నాయి. వ్యవసాయ పనులు తక్కువగా ఉండడంతో కూలీలు ఉపాధి పనులకే మొగ్గుచూపుతున్నారు. అధికారులు అవగాహన కల్పించడంతో యువకులు, మహిళలు అధిక సంఖ్యలో ఉపాధి పనులకు తరలివస్తున్నారు. దీంతో పని ప్రదేశాల్లో కూలీలతో జాతరను తలపిస్తోంది. ఉపాధి కూలీలు చెక్‌డ్యాంలు, చెరవులు, కాలువలో పూడికతీత పనులు చేపడుతున్నారు. మండలంలో దాదాపు 5,050 మంది కూలీలు ఉపాధి పనులకు హాజరవుతున్నారని, జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరూ ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోవాలని ఏపీఓ శ్రీనివాసులు సూచించారు.